క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన



కిర్లంపూడిలో పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కిర్లంపూడి: కిర్లంపూడిలో నిర్మిస్తున్న నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పక్కన నిర్మిస్తున్న నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరో మూడు నెలల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేసి, గ్రీనరీ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జగ్గంపేట సీఐ సూర్యఅప్పారావు, కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బూరుగుపూడి నుంచి భద్రాచలానికి బైక్ ర్యాలీ



బూరుగుపూడి నుంచి భద్రాచలం బైక్ ర్యాలీగా వెళ్లేందుకు సిద్ధమైన మఠాధిపతులు, భక్తులు

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి నుంచి పుణ్యక్షేత్రమైన భద్రాచలం రాములోరి సన్నిధికి మోటారు సైకిళ్లపై భక్తులు ర్యాలీగా బయలుదేరారు. గండేపల్లి మండలం తాళ్లూరు మఠాధిపతి పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ అచార్యులు, యోగి అతిథేశ్వరానందశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వరానందస్వామి, గీతాప్రకాశనంద స్వామి ఈ బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం భద్రాచలంలో జరిగే సీతారామల కల్యాణానికి ఇక్కడ నుంచి బైక్ ర్యాలీగా వెళుతున్నట్టు చెప్పారు. జగ్గంపేట, గోకవరం మీదుగా భద్రాచలం శ్రీరాముని సన్నిధికి చేరుకుంటామని చెప్పారు. ప్రణవానంద స్వామి, సుప్రీంకోర్టు లాయర్ టి.బాలరాజు, వెంకటేశ్వరస్వామి, వి.నాగేశ్వరఅచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వేంచేసిన సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తోట నవీన్, జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్రతో పాటు పలువురు భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తుని/ఏలేశ్వరం/జగ్గంపేట/గండేపల్లి/కిర్లంపూడి: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. తుని గొల్ల అప్పారావు, మార్కెట్ యార్డు సెంటర్లలోని ఎన్‌టీఆర్ విగ్రహాలకు టీడీపీ నేత యనమల కృష్ణుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలేశ్వరం, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడిలో ఎన్‌టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కిర్లంపూడి: మండల పరిధిలోని గోనేడలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జనసేన పార్టీ జగ్గంపేట ఇంచార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర, శ్రీదేవి దంపతులు ప్రారంభించారు. నేత్ర వైద్యులు కరుణ్ కుమార్ 250 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 30 మందిని ఆపరేషన్ల నిమిత్తం రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం ఆసుపత్రికి తరలించారు. 50 మందికి సబ్సిడితో కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు షేక్ బషీర్, రామ్, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేస్తే విజయం మనదే

తుని రూరల్: మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో మనదే విజయమని శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు అన్నారు. మండలంలోని టి.తిమ్మాపురం శివారులో బుధవారం టీడీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ప్రస్తుత రాజకీయాలు డబ్బు ప్రవాహం, పగలు, ప్రతీకారాలతో నడుస్తున్నాయన్నారు. టీడీపీలో చేరేందుకు అన్నిగ్రామాల నుంచి ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు సంప్రదిస్తున్నారని యనమల కృష్ణుడు అన్నారు. తాను స్థిర నివాసం ఇక్కడే ఏర్పాటు చేసుకుంటున్నాని, కార్యకర్తలు తనను స్వేచ్ఛగా కలసి పార్టీ విజయానికి సలహాలు, సూచనలు చేయవచ్చని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యనమల దివ్య అన్నారు. తుని పట్టణ, మూడు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రామయ్యా పెళ్లికొడుకాయనే..

- రత్నగిరిపై శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం
- వధూవరులుగా దర్శనమిచ్చిన స్వామి, అమ్మవార్లు
- నేడు సీతారాముల కల్యాణం



రత్నగిరి రామాలయంలో సీతారాములను వధూవరులను చేస్తున్న పండితులు



రత్నగిరిపై పసుపు దంచుతున్న ముత్తయిదువులు



ఏలేశ్వరంలో ఆలయం వద్ద వేసిన చలువ పందిరి



ప్రత్తిపాడులోని మునసబు గారి రామాలయంలో కొలువుదీరిన సీతారాములు

అన్నవరం: రత్నగిరిపై శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి పెళ్లిపెద్దలుగా విచ్చేయగా రామాలయంలో శ్రీసీతారాములను వధూవరులను చేసే కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం నాలుగు గంటలకు పండితులు సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి నూతన వధూవరులను చేశారు. వధూవరులకు దేవస్థానం తరఫున చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ నూతన పట్టు వస్త్రాలను సమర్పించారు. ముత్తయిదవులు పసుపు దంచారు. అనంతరం ముత్తయిదవులకు తాంబూలం, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరబట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, చిట్టి శివ, ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, రామాలయం అర్చకులు ఇంద్రగంటి బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల దివ్యకల్యాణాన్ని గురువారం ఉదయం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 6.30 గంటలకు సీతారాములను ఆంజనేయ, గజ వాహనాల మీద, పెళ్లిపెద్దలు శ్రీసత్యదేవుడు, అమ్మవార్లను పల్లకీ మీద అన్నవరంలో ఊరేగిస్తారు. అనంతరం రత్నగిరి రామాలయం వద్ద గల నూతన కల్యాణ వేదిక మీద ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకూ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. ఈ కల్యాణానికి సత్యదేవుడు, అమ్మవారు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు.

తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు

రత్నగిరిపై తొమ్మిది రోజుల పాటు శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తారు. ఈ నెల 6న శ్రీపుష్పయోగ ఉత్సవాలు ముగుస్తాయి.

శ్రీరామనవమి వేడుకలకు సిద్ధం

ఏలేశ్వరం: గ్రామాల్లో శ్రీరామ నవమి సందడి నెలకొంది. నియోజకవర్గవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ గురువారం సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించేందుకు ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేసి ఆలయాలను రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఏలేశ్వరంలోని దిబ్బలపాలెం, పల్లపువీధి, పెద్దవీధి రామాలయాల వద్ద ఐదు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రత్తిపాడు: శ్రీరామనవమి వేడుకలకు రామ కోవెలలు ముస్తాబయ్యాయి. గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. మండలంలోని ప్రత్తిపాడు, ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ, టి.రాయవరం, పి.జగన్నాథపురం తదితర గ్రామాల్లో రామాలయాలను విద్యుత్ దీపాలు, రంగులతో సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు.

థ్యాంక్యూ సీఎం సార్

జగ్గంపేట: దళిత క్రిస్టియన్లకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించేందుకు బిల్లు ప్రవేశపెట్టడం, పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లించడం ద్వారా క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి క్రైస్తవులు కృతజ్ఞతలు తెలిపారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. జగ్గంపేటలో బుధవారం యునైటెడ్ పాస్టర్స్ పెలోషిప్ ఆధ్వర్యంలో థ్యాంక్యూ సీఎం సార్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబులను ఆశీర్వదిస్తూ పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం యునైటెడ్ పాస్టర్స్ పెలోషిప్ మండలాధ్యక్షుడు జాన్ వెస్లీ ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు ఎమ్మెల్యే చంటిబాబును పూలమాలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోటరవి, జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా, జగ్గంపేట నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కన్వీనర్ విజయసుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

తుని: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వాకర్స్ హెల్త్ క్లబ్ ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ సూచించారు. స్థానిక బ్యాంక్ కాలనీ చక్కా సూర్యనారాయణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు విశ్రాంతి ఉపాధ్యాయుడు కె.జోసెఫ్ సమకూర్చిన అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర పరీక్ష సామగ్రిని బుధవారం ఆయన అందజేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. డిప్యూటీ గవర్నర్ రెడ్డి రత్నం, వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు కుందెం సత్యనారాయణ, కార్యదర్శి చోడిశెట్టి బాబూరావు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత



గోకవరంలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో ఎక్కువ సంక్షేమ పథకాలను మహిళలకే కేటాయించారని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మహిళా పక్షపాతి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పసుపు, కుంకుమ పేరుతో చంద్రబాబు మహిళలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళలకు అన్ని పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం మండలంలో 1415 డ్వాక్రా సంఘాలకు మూడో విడతలో ఆసరా పథకంలో మంజూరైన రూ.13.42 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, సుంకర వెంకట రమణ, నరాలశెట్టి నర్శయ్య, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు సందర్శన

గోకవరంలో తూర్పుకాపు, వెలమ సంఘాలకు కేటాయించిన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే చంటిబాబు సందర్శించారు. గత కొంత కాలంగా నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని ఇటీవల రెండు సంఘాలకు ఎమ్మెల్యే కేటాయించారు. దీనిలో భాగంగా బుధవారం ఈ భవనాన్ని సందర్శించగా ఆయా సంఘాల నాయకులు ఎమ్మెల్యేను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు తుమ్మల చిన్నబ్బు, గౌరవాధ్యక్షుడు సుంకర వెంకటరమణ, వెలమ సంఘం నాయకుడు చింతల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- శంఖవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



శంఖవరంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరంలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి స్థానిక వైష్ణవ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కరోనా కష్ట కాలంలోనూ రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ జలకళ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలు కావాలంటే మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు,ఎంపీడీఓ జె.రాంబాబు, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, ఆడపా వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు బుర్ర లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఆశ్రయించిన ప్రేమ జంట

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన ప్రేమ జంట బుధవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. ఒమ్మంగి గ్రామానికి చెందిన సాధనాల నాగబాబు, అదే గ్రామానికి చెందిన తంగెళ్ల అఖిల గత మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇరు కుటుంబాల వారు పెళ్లికి అంగీకరించకపోవడంతో మంగళవారం వారు తమ ఇళ్ల నుంచి పరారయ్యారు. హిందూ సంప్రదాయం ప్రకారం తాళ్లూరు నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో వివాహం చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యుల నుంచి ఎటువంటి ప్రాణహాని లేకుండా చూడాలంటూ ప్రత్తిపాడు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరు కుటుంబాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో ఇరు వర్గీయులు వారి వివాహాన్ని సమ్మతించడంతో మేజర్లు అయిన పేమికులు పోలీస్ స్టేషన్ ఆవరణలో దండలు మార్చుకుని ఒక్కటయ్యారు.

మహిళలు అన్నిరంగాల్లో ప్రతిభ చూపాలి

తుని: మహిళలు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. తుని పురపాలక సంఘం కార్యాలయం నుంచి మహిళా సంఘాలు చేపట్టిన ర్యాలీని బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక బాలాజీ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. మహిళలు వివిధ రంగాల్లో ఆర్థికంగా బలోపేతమవుతున్నారని, వీరిని ప్రోత్సహించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా త్వరలో అవార్డులు అందజేస్తారని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. కౌన్సిలర్ కర్రి సత్య జగదీష్, మెప్మా అధికారి శ్రీదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు శ్రీదేవి, రిసోర్స్ పర్సన్లు, శానిటేషన్ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలోని పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్షలు రాశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల బాలికల కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 15 నుంచి పరీక్షలు ప్రారంభం కాగా బుధవారంతో ముగిశాయి. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఇన్విజిలేటర్లు జంబ్లింగ్ విధానంలో విధులకు హాజరయ్యారు. చివరి రోజు పరీక్షలకు గురుకుల బాలికల కళాశాల పరీక్ష కేంద్రంలో 340 మందికి 16 మంది గైర్హజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 313 మందికి 15 మంది గైర్హజయ్యారు. గురుకుల కళాశాలలో పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా చంద్రశారద, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పలివెల శివాజీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎస్‌హెచ్ కుమారి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా కె. చినబుజ్జి వ్యవహరించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రత్తిపాడు: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ప్రత్తిపాడు హర్షవర్ధన జూనియర్ కళాశాలలో చివరి రోజు జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలకు 351 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 339 మంది హాజరయ్యారని అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ సీహెచ్ ఆనందకుమార్ జోషి తెలిపారు.

ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



శంఖవరంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వైఎస్సార్ ఆసరా పథకం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక సత్యదేవ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలంలోని 10,440 స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.8.5 కోట్ల నమూనా చెక్కును లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు ప్రభుత్వం సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, వైఎస్సార్ సీపీ కాకినాడ బీసీ సెల్ అధ్యక్షుడు ఈగల అప్పారావు, మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచులు కూనిశెట్టి మాణిక్యం, సరుకు గుర్రాజు, బైరా ఉప్పారావు, ఏపీఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

శంఖవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక సత్యదేవ కల్యాణ మండపంలో బుధవారం కాకినాడ జిల్లా ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోందన్నారు. నియోజకవర్గంలో గతంలో పెద్దాపురం, పిఠాపురం ఐసీడీఎస్ పరిధిలో ఉండే కొన్ని అంగన్‌వాడీ సెంటర్లను ప్రస్తుతం శంఖవరం ఐసీడీఎస్ పరిధిలోకి తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, సూపర్ వైజర్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

- స్వపక్షంలో విపక్షంగా వ్యవహరించిన కౌన్సిలర్లు
- వార్డుల్లో అభివృద్ధి పనులపై వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అలమండ సత్యవతి



రసాభాసగా మారిన కౌన్సిల్ సమావేశం

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా జరిగింది. స్వపక్షంలోనే విపక్షంగా అధికార పార్టీ కౌన్సిలర్లు వ్యవహరించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రశ్నించడమే అజెండాగా కౌన్సిలర్లు వ్యవహరించారు. పట్టణాభివృద్ధి కాకుండా తమ వార్డులకే ప్రాధాన్యత ఇవ్వాలని కౌన్సిలర్లు వాగ్వాదాలకు దిగారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో తొలుత అజెండా చదువుతుండగా 10వ వార్డు కౌన్సిలర్ కోరాడ రామలక్ష్మి తన వార్డులో అభివృద్ధి జరగడం లేదని కొన్ని వార్డులనే అభివృద్ధి చేస్తున్నారని కమిషనర్ కె.శ్రీనివాసరావును ప్రశ్నించారు. అజెండా పూర్తి కాగానే సమాధానం చెబుతానని కమిషనర్ సమాధానమిచ్చారు. దీంతో 12వవార్డు కౌన్సిలర్ సామంతుల హైమావతి తమ వార్డులో అభివృద్ధి జరగడం లేదని ప్రశ్నించారు. వీరిద్దరూ పట్టణంలో జరుగుతున్న ఆక్రమణల తొలగింపు, డ్రైన్ల నిర్మాణంపై పలుప్రశ్నలు సంధించారు. వీరితో పాటు 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు ఆక్రమణలు తొలగించేటప్పుడు కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. టీపీఓ ఆనంద్ తొలగింపులపై వివరణ ఇచ్చారు.4వవార్డు కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి తన షాపునకు పూర్తిస్థాయిలో డ్యాకుమెంట్లు ఉన్నా పట్టణాభివృద్ధి కోసం అవసరం మేరకు తొలగిస్తానని చెప్పారు. ముందుగానే తొలగిస్తే సమస్య ఉండదని గోవిందు అనడంతో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరగగా కౌన్సిలర్లు యండగండి నాగబాబు, కోనాల వెంకటరమణలు గోపికి సంఘీభావం ప్రకటించారు. వాగ్వాదం పెరగడంతో 9వ వార్డు కౌన్సిలర్ అలమండ చలమయ్య వారితో వారించారు. అనంతరం సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు దళే కిషోర్, దిలబర్ హుస్సేన్, వాగు బలరామ్, పెండ్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్' ఘనత సీఎం జగన్‌దే

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



గోకవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గోకవరం: దేశంలోనే ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరం ప్రభుత్వాస్పత్రి పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించేందుకు మంజూరైన అదనపు వాహనాన్ని బుధవారం ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా సీనియర్ నాయకుడు కర్రి సూరారెడ్డిని ప్రకటించారు. త్వరలోనే అధికారికంగా కమిటీని వెల్లడిస్తామన్నారు. వీరలంకపల్లిలో జరిగిన కార్యక్రమంలో రంపయర్రంపాలెం మాజీ సర్పంచ్ కర్రి అరుణ కుమారి, శివరామకృష్ణ దంపతులు కొనుగోలు చేసిన జేసీబీ వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని రైతు కొరిపల్లి అప్పలస్వామి, తదితరులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అనంతరం గోకవరం గ్రామ దేవత గుబ్బాలమ్మ తీర్థం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ చైర్మన్ నరాలశెట్టి నర్శయ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.